జూలై 1న గ్రూప్ - 4

- పరీక్షకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 40 కేంద్రాల్లో పరీక్షలు

3లో..



పీఎంశ్రీతో పాఠశాలలకు మహర్దశ

- కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలు, డిజిటల్ తరగతులు
- ఐదేండ్ల పాటు ప్రత్యేక నిధులు

3లో..





2023-24 సంవత్సర
విద్యా వికాసం
నవతెలంగాణ ప్రత్యేక సంచిక

అనుదినం.. జనస్వరం

నిజామాబాద్-కామారెడ్డి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

08 పేజీలు | మంగళవారం 27 జూన్ 2023 | www.navatelangana.com

బడిబాటకు అపూర్వ స్పందన



- రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక అడ్మిషన్లు
- ప్రయివేటు నుంచి ప్రభుత్వ స్కూల్‌కు
- కళకళలాడుతున్న సర్కారు పాఠశాలలు
- కేజీబీవీల్లో అడ్మిషన్లు ఫుల్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి చేపడుతున్న చర్యలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఈ స్కూళ్లపట్ల విశ్వాసం పెరుగుతోంది. ప్రతియేటా ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు బారులుకడుతున్నారు. ఈ యేడాది ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 8,482 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. రాష్ట్రవ్యాప్తంగా పొల్చితే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలోనే బడిబాటలో భారీగా అడ్మిషన్లు జరగడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడితో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ స్కూళ్లు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1195 స్కూళ్లున్నాయి. ఈ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3వ తేదీ నుంచి 23వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా అపూర్వ స్పందన వచ్చింది. ప్రీ ప్రైమరీ తరగతులకు కూడా జిల్లాలో అడ్మిషన్లు జరిగాయి. మొత్తం 373 మంది విద్యార్థులు ప్రీప్రైమరీలో చేరారు. కొన్ని ప్రైమరీ స్కూళ్లలో ఆయా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు జిల్లా విద్యాశాఖ నుంచి ముందస్తుగా అనుమతి తీసుకుని డిమాండ్ ఉన్న దగ్గర ప్రీప్రైమరీ తరగతులూ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక ఒకటవ తరగతికి మొత్తం ఈ యేడాది 6,746 మంది విద్యార్థులు చేరారు. ఇందులో ప్రయివేటు స్కూళ్ల విద్యార్థులు 586 మంది ఉన్నారు. 1514 మంది విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా ప్రభుత్వ స్కూళ్లకు వచ్చి అడ్మిషన్లు తీసుకున్నారు. ఇక రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 7896 మంది విద్యార్థులు చేరారు. మొత్తంగా ప్రయివేటు స్కూళ్ల నుంచి 8,482 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు.

కేజీబీవీలకూ క్యూ..

బాలికల విద్యలో కీలక భూమిక పోషిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీల)కు పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. మిగతా 4లో..

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

- మధ్యాహ్న భోజనంలో మరింత పౌష్టికాహారం
- డీఈఓ దుర్గాప్రసాద్

4లో..



ఇంటర్ తర్వాత.. అనేక కోర్సులు

- **అభిరుచి.. ఆసక్తి ఉన్న కోర్సులు ఎంచుకుంటేనే రాణించగలం**

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సు తీసుకోవాలనే సందేహాలు చాలామంది విద్యార్థుల్లో ఉంటాయి. ఇంటర్ తర్వాత ఎన్నో కెరీర్ ఆప్షన్లు ఉన్నా.. కోర్సు ఎంపిక చేసుకోవడంలో తికమక పడిపోతుంటారు. విద్యార్థి ఏ రంగంలో ఉన్నత విద్య చేయాలో నిర్ణయమైతే.. అభిరుచిని బట్టి ఆయా కోర్సుల్ని ఎంచుకొని కెరీర్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవచ్చు. ఇంజినీరింగ్, మెడిసిన్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ రంగాల్లో కోర్సుల వివరాలు, ఇంటర్ తర్వాత ఉన్నత విద్య కోర్సుల కోసం ఏయే ప్రవేశపరీక్షలు అందుబాటులో ఉంటాయో? ఆ వివరాలు మీకోసం..

ఇంటర్ తర్వాత ఎన్నో మార్గాలు..

ఎంపీసీ చదివిన విద్యార్థులకు ఇంజనీరింగ్‌తోపాటు కెరీర్ అవకాశాలుఇంజనీరింగ్ కెరీర్: ఎంపీసీ చదివిన విద్యార్థుల్లో అధికశాతం ఇంజనీరింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, యూనివర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. అందుకు ప్రతి ఏటా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

జేఈఈ

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఇది మెయిన్, అడ్వాన్స్‌డ్ అనే రెండు దశలుగా ఉంటుంది. జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశ కౌన్సెలింగ్‌కు అర్హత లభిస్తుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ కూడా రాసిన విద్యార్థులకు వచ్చిన ర్యాంకు ఆధారంగా ఐఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు.



ఎంసెట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు ఎంసెట్ పరీక్షను ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుంది. ఎంసెట్ ర్యాంకు ద్వారా ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

బిట్‌శాట్: దీని ద్వారా ప్రముఖ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఇంజనీరింగ్ కోర్సుల్లో అడుగుపెట్టొచ్చు. అలాగే వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ప్రవేశ పరీక్షల ద్వారా అడ్మిషన్‌లు కల్పిస్తున్నాయి.

బీఎస్సీ ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ స్థాయిలో బీఎస్సీని కూడా ఎంపిక చేసుకోవచ్చు. బీఎస్సీ కోర్సులోనూ వివిధ స్పెషలైజేషన్లు ఉంటాయి.



ఉద్యోగావకాశాలు: ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ చదివిన విద్యార్థులకు.. యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఎగ్జామినేషన్, స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్ ఎగ్జామినేషన్ (ఎస్‌సీఆర్ఏ), ఇండియన్ ఆర్మీ నిర్వహించే 10o2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు.. అనేక స్టేట్ లెవల్ ఉద్యోగాలకు అర్హులే.

బైపీసీ చదివిన విద్యార్థులకు కెరీర్ అవకాశాలు

బైపీసీ

మెడికల్ ఫీల్డ్‌లో సెటిల్ అవ్వాలనుకునే విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయవల్సి ఉంటుంది. వైద్యులుగానేకాకుండా.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ, డైరీ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్ వంటి మరెన్నో కోర్సులు కూడా ఉన్నాయి. బీఎస్సీతోపాటు, బీజడ్‌సీతోపాటు బయోకెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, జెనెటిక్స్ తదితర లైఫ్ సైన్సెస్ కోర్సులు కూడా డిగ్రీ స్థాయిలో చదవవచ్చు.

ఫార్మసీ కోర్సులు

పీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీఫార్మసీ, ఫార్మా-డీ, డిప్లొమా ఇన్ ఫార్మసీ అనే మూడు స్థాయిల కోర్సులు చేయవచ్చు. బీఫార్మసీ, ఫార్మా-డీకి ఎంసెట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం లభిస్తుంది. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, క్లినికల్ రీసెర్చ్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

మెడికల్ కోర్సులు

మెడికల్ రంగంలో ఎంబీబీఎస్, బీడీఎస్, బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి, బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ సైన్సెస్ కోర్సులు

ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆప్టోమెట్రీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ కోర్సులు

బైపీసీ ఉత్తీర్ణులకు డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులు కూడా చేయవచ్చు

హెచ్ఈసీ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు

హెచ్ఈసీ విద్యార్థులు సాధారణంగా డిగ్రీ స్థాయిలో బీఏను ఎంచుకుంటారు. హెచ్ఈసీ పూర్తి చేసినవారు సివిల్ సర్వీసెస్, రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్, వీఆర్వో/వీఆర్ఏ వరకూ అన్ని పోటీ పరీక్షలు రాయవచ్చు. హెచ్ఈసీ విద్యార్థులు సంప్రదాయ బీఏ కోర్సుకు ప్రత్యామ్నాయంగా బీఏ-ఎల్ఎల్‌బీ కూడా చేయవచ్చు. ఇంటర్మీడియెట్ అర్హతతో ఐదేళ్ల లా కోర్సులో అడుగుపెట్టొచ్చు. కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా 'లా' కోర్సులో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, కార్పొరేట్ లా వంటి తదితర కొత్త సబ్జెక్టులను ఎంచుకోవచ్చు. లా పూర్తి చేసిన అభ్యర్థులు కేవలం న్యాయవాద వత్తికే పరిమితం కాకుండా కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

సీఈసీ

సాధారణంగా సీఈసీ విద్యార్థులు డిగ్రీ స్థాయిలో బీకాం కోర్సును ఎంచుకుంటారు. డిగ్రీతోపాటు సీఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులను పూర్తిచేయొచ్చు. చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ.. సీఈసీ విద్యార్థులు ఎంచుకోదగిన మూడు ముఖ్యమైన ప్రొఫెషనల్ కోర్సులు.

ఇంటర్ అర్హతతో రాయదగిన పోటీ పరీక్షలు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్, తపాలా శాఖలో పోస్టల్ అసిస్టెంట్స్, సార్టింగ్ అసిస్టెంట్ ఉద్యోగాలు, పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పోస్టులు, పారా మిలిటరీ పోస్టులు (జాతీయ స్థాయిలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఇండో-టిబెటిన్ బోర్డర్ ఫోర్స్ తదితర పారా మిలిటరీ విభాగాల్లోనూ కానిస్టేబుల్ ఉద్యోగాలు), రాష్ట్ర స్థాయిలో అన్నిరకాల (గ్రూప్-4 ఉద్యోగాలు పొందవచ్చు. డీఈడీతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించవచ్చు. అలాగే టూరిజం అండ్ హాస్పిటాలిటీ కోర్సుల్లో చేరవచ్చు.



ఫైన్ ఆర్ట్స్‌తో కలర్‌ఫుల్ కెరీర్



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

కొన్ని రంగాల్లో సృజనాత్మకతుంటే.. ఆకాశమే హద్దు. క్రియేటివిటీతో కెరీర్‌లో దూసుకుపోవచ్చు.వ్యక్తిగత సృజనాత్మకతను సానపెట్టే కోర్సులు కొన్ని ఉన్నాయి. అవే.. ఫైన్ ఆర్ట్స్ కోర్సులు వీటిని బ్యాచిలర్ స్థాయిలో వివిధ సంస్థలు అందిస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనది హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ అర్కిటెక్కర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) ఈ విద్యాసంస్థ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆవివరాలు..

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కోర్సులను అందిస్తోంది. బ్యాచిలర్ స్థాయిలో బీఎఫ్ఏలో పెయింటింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ కోర్సుల్లో ఈ యూనివర్సిటీ ప్రవేశాలు కల్పిస్తోంది. 2023-24 విద్యా సంవత్సరానికి సబంధించి ప్రవేశాలకు ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ)ని నిర్వహించనుంది. ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫొటోగ్రఫీకోర్సుకు

కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్‌స పరీక్ష 100మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 90 నమిషాలు, ఇందులో డ్రాయింగ్, కంపోజిషన్ నైపుణ్యాలు పరిశీలిస్తారు. పెన్సిల్‌తో ఇచ్చిన చిత్రలకు షేడ్‌లు ఇవ్వాలి. అక్కడున్న చిత్రాలను క్రమపద్ధతిలో అమర్చాలి. ఏదైనా అసంపూర్ణ దృశ్యం ఇచ్చి దాని చుట్టూ ఉండే అవసరమైన ఇతర అంశాలను అందులో చేర్చి తీర్చిదిద్దమంటారు. వీటన్నింటికీ పరీక్షలో ప్రాధాన్యం ఉంటుంది. మరో అబ్జెక్టివ్ టైప్ 50మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్15, ఇంగ్లీష్15, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.

ఇంటీరియర్ డిజైన్‌లోనూ

ఈ పరీక్షను 200మార్చులకు 3గంటల వ్యవధితో నిర్వహిస్తారు. ఇండులో జేకే, కరెంట్ అఫైర్స్ 20, కమ్యూనికేషన్ స్కిల్స్ 50, ఇలస్ట్రేటివ్, అనలిటికల్ అండ్ డిజైన్ ఎబిలిటీ 50, మెమోరీ డ్రాయింగ్ 30, కలర్ కో ఆర్డినేషన్ 30మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు.

ఉద్యోగ అవకాశాలు

ఆయా ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల ఉత్తీర్ణులకు నైపుణ్యాలుంటే



విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్ , పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్, టెక్స్‌టైల్ పరిశ్రమ, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్, తదితర సంస్థల్లో ఉద్యోగాలు ఇస్తున్నాయి. గ్యాలరీల్లో వీరు తమ ప్రతిభను చూపించవచ్చు. ఫొటోగ్రఫీ చేసిన వారికి ఉపాధి కొదవలేదు. వీరికి ఫ్రీలాన్సింగ్, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల..

విద్యార్థుల బంగారు భవితకు బాటలు

- ఆహ్లాదకర వాతావరణంలో క్యాంపస్
- ప్రతిభగల లెక్చరర్‌లతో బోధన.. ప్లేస్‌మెంట్‌లు

నవతెలంగాణ-ఆర్మూర్(నిజామాబాద్)

సువిశాలమైన ప్రాంగణం. ప్రశాంత వాతావరణం.. అడుగుకో చెట్టు.. ఎటు చూసినా పచ్చదనమే. నందనవనాన్ని తలపించేలా ఆహ్లాదకర వాతావరణం. ఇదెక్కడో కాదు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణానికి జాతీయ రహదారి 63 చేపూరు దగ్గర గల క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోనే మహామహా కాలేజీలను తలదన్నే విధంగా విద్యాభ్యాసం కొనసాగించిన వారు ఎందరో దేశ విదేశాలలో ఉన్నత స్థానంలో స్థిరపడి తమ జీవితాలను బంగారు భవిష్యత్తుగా మార్చుకున్నారని కాలేజీ యాజమాన్యం పేర్కొంది.

సృజనాత్మకతను వెలికితీస్తూ..

చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో... భూమిని చూసి ఓర్పును నేర్చుకో... చెట్టును చూసి ఎదుగుదలను నేర్చుకో.. గురువును చూసి సుగుణాలు నేర్చుకో అన్నారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. తల్లి తండ్రి తర్వాత గురువే దైవం. ఎంతోమంది గురువులు తమ జీవితాలను త్యాగం చేసి భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్నారు. బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో



ఆహ్లాదకర వాతావరణంలో క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజీ

చదివిన విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగడం హర్షించదగ్గ విషయం.

2001 ప్రారంభమైన ఇంజనీరింగ్ కళాశాల బీటెక్, పాలిటెక్నిక్, ఎంబీఏల లోని వివిధ కోర్సులలో అత్యంత ప్రతిభ గల లెక్చరర్‌లతో బోధన కొనసాగిస్తూ డిజిటల్ క్లాస్ మెంట్, టాస్కు రిజిస్ట్రేషన్స్, ఇంటర్నెట్ బ్రౌజింగ్ స్పెషాలిటీ, 100 ప్లేస్మెంట్, ఆటలతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఎన్ఎస్ఎస్ ద్వారా సేవ కార్యక్రమాలు సైతం క్షత్రియ ఇంజనీరింగ్ విద్యార్థులు చేపట్టారు. ప్రాజెక్టు వర్క్, ఆన్‌లైన్ కంప్యూటర్ ల్యాబ్, ఈసీఈ, ఈ ల్యాబ్ ప్రత్యేకమైన రూములలో బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయంతో పాటు, ప్రతి ఒక్కరికి తాగేందుకు స్వచ్ఛమైన ఆర్ఓ ప్లాంట్ నీటి సదుపాయం కల్పించారు.

ఉద్యోగ కల్పన తీరుతెన్నులలో


క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ కల్పన తీరుతెనులపై అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి అనేక సందేహాలను నివృత్తి చేస్తూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాలను పొందడానికి మార్గాలను గురించి అవగాహన కలిగి ఉండేందుకు కృషి చేస్తున్నారు. అడ్మిషన్లు పొందేందుకు 9490509688, 7780238595, 9989288829 నంబర్లకు సంప్రదించాలని కోరినారు.

వసతుల కల్పనలో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల మహాత్మా గాంధీ నేషనల్ సెంటర్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ కేంద్ర ప్రభుత్వం చే వసతుల కల్పనలో ఏ ప్లేస్ గ్రేడు సర్టిఫికేట్ సైతం పొందింది.

నిపుణులైన అధ్యాపకులతో బోధన

అల్జాపూర్ శ్రీనివాస్, క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్, ఆర్మూర్.



విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నిర్విరామ కృషి చేస్తుంది. ఇంజనీరింగ్ ఎంబీఏ తదితర కోర్సులలో చదివిన విద్యార్థులు చదువు పూర్తి చేసిన వారు ప్రతి సంవత్సరం క్యాంపస్ నుండి సుమారు 50, 60 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు.

పీఎంశ్రీతో పాఠశాలలకు మహర్దశ

- కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలు, డిజిటల్ తరగతులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యా రంగానికి తెలంగాణ ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ ....ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చింది. మండలంలోని మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకానికి అర్హత సాధించింది. గత జనవరిలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య ప్రత్యేక చొరవ తీసుకొని ఆన్లైన్లో పథకానికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు. పాఠశాలలను పరిశీలించి వివరాలను ధృవీకరించి నివేదికను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపగా పథకానికి అర్హత సాధించటం ప్రత్యేకతను సంతరించింది..

అనుమతించిన అంశాలు...

పీఎం శ్రీ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం 5 అంశాలలో అభివృద్ధి కోసం అనుమతులు జారీ చేసింది.. గదికి 13 లక్షల చొప్పున 52 లక్షలు, 40 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేయడానికి 15వేల చొప్పున ఆరు లక్షలు, క్రీడల నిర్వహణకు లక్ష యాభై వేలు, గ్రంథాలయానికి ఆరు లక్షలు, విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించడానికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కింద 6 లక్షలు కేటాయించారు.

ప్రయోజనాలు...

పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు 2023-24 విద్యాసంవత్సరం నుంచి సంవత్సరానికి 42 లక్షల చొప్పున 5 సంవత్సరాల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60: 40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తాయి. దీంతో పాఠశాలల్లో ఎల్ఈడి లైట్లు, సోలార్ ప్యానల్, ప్లాస్టిక్ రహిత వ్యర్థ పదార్థాల నిర్వహణ, సొంత భవనాలు, మరుగుదొడ్లు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు, డిజిటల్ గ్రంథాలయం పోషకాహార తోటల పెంపకం చేపడతారు.

స్వచ్ఛ విద్యాలయ విభాగంలో పట్టణ బాలుర పాఠశాల...



మగ్గిడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఎంపిక కావడం విశేషం.. నిజామాబాద్ జిల్లా నుంచి ఎంపికైన ఏకైక పాఠశాలగా గుర్తింపు సాధించింది. నీరు, మరుగుదొడ్ల ,పరిశుభ్రత, పాఠశాల నిర్వహణ, భవనం తదితర అన్ని అంశాలపై రాష్ట్ర బృందం పట్టణంలో పర్యటించి ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 పాఠశాలలకు ర్యాంకులను ప్రకటించగా 5 స్టార్స్‌తో రెండో ర్యాంకు సాధించింది .దీంతో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కవితకు అవార్డుతో పాటు నగదు బహుమతి అందజేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సైతం ఈ పాఠశాలలో చదువుకోవడం విశేషం. పట్టణంలోని బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉత్తీర్ణతపై నిర్విరామ కృషి చేస్తున్నారు. వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకుడ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంకం నరేష్, సురేష్ సైతం విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండేందుకు కృషి చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో..

లక్ష్మీ నర్సయ్య, ప్రధానోపాధ్యాయుడు-మగ్గిడి



ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందచేందుకు ప్రభుత్వం సంకల్పించడం హర్షనీయం. దీంతో పాఠశాల నూతన హంగులను సంతరించు కుంటుంది.

నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం

గోపాల్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పచ్చల నడుకుడ



ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుండడతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది.

జూలై 1న గ్రూప్ - 4

- పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నతెలంగాణ-కామారెడ్డి

జూలై 1వ తేదీనా గ్రూప్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం గ్రూప్ -4 పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 9 రూట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూట్ ఆఫీసర్స్, లైజనింగ్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లు పరీక్ష సజావుగా జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు ప్రత్యేక గదులు కేటాయించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో తీసుకెళ్లవద్దని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఏవో రవీందర్, పరీక్షల విభాగం అధికారి లింగం, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

- మధ్యాహ్న భోజనంలో మరింత పౌష్టికాహారం
- డీఈఓ దుర్గాప్రసాద్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య లభిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ స్కూళ్లకు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూనే పోషకాహారం అందచేస్తున్నామని వివరించారు. ఈ యేడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాగి జావ ప్రవేశపెట్టిందని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ కూడా మార్చిందని వివరించారు. మరింత పౌష్టికాహారం అందించేలా మెనులో మార్పులు చేశారని తెలిపారు. ప్రయివేటులో ఫీజుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అయితే ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో శాఖాపరంగా చర్యలు తీసుకోవడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. నవతెలంగాణ ఎడ్యూకేషన్ స్పెషల్ సందర్భంగా డీఈఓ దుర్గాప్రసాద్ నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

మన ఊరు-మన బడితో రూపురేఖలు మార్పు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు-మన బడితో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారుతున్నాయని డీఈఓ దుర్గాప్రసాద్ చెప్పారు. జిల్లాలో మొదటి విడతలో 407 స్కూళ్లు ఎంపికవ్వగా.. 405 స్కూళ్లకు అనుమతులు వచ్చాయని తెలిపారు. అన్ని స్కూళ్లలో పనులు వివిధ దశలో కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లావ్యాప్తంగా 23 స్కూళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రారంభించామని అన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందచేస్తు న్నామని తెలిపారు.


డీఈవో దుర్గాప్రసాద్

ప్రయివేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు..

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగిందని, ఫలితంగా ప్రతియేడు ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ యేడాది ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు 9 వేల మంది విద్యార్థులు వచ్చి చేరారని వివరించారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం విజయవంతం చేస్తున్నామని తెలిపారు. బడిబయట పిల్లలను స్కూళ్లలో చేర్పించడంతో పాటు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్ అయ్యేలా చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, ఖాళీల భర్తీపై ఇప్పటికే ఎంఈఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.



ఫీజులపై చర్యలు చేపడతాం..

ప్రయివేటు స్కూళ్లలో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచితే చర్యలు చేపడతామని డీఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. ఫీజుల పెంపు విషయంలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ యాజమా న్యం నిర్ణయించాలని, ఆ కమిటీకి పూర్తి సమాచారం ఉండాలని తెలిపారు. ప్రయివేటు స్కూళ్లపై నిర్దిష్టమైన ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు చేపడతామని వివరించారు. ఇక స్కూళ్లలో ఫీజులకు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించామని, మరోసారి సర్క్యులర్ జారీ చేస్తామని తెలిపారు.

ప్రయివేటుకు పంపొద్దు..

జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని డీఈఓ సూచించారు. కేవలం ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని గుర్తు చేశారు. ప్రయివేటులోఫీజుల కోసం అప్పులు చేసి అవస్థలు పాలుకావొద్దని సూచించారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో విద్య



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బ్రిలియంట్ పీపుల్ స్కూల్లో విద్యార్థులకు తక్కువ ఫీజులతోని నాణ్యమైన అందిస్తున్నామని ప్రిన్సిపాల్ వి.సునీత తెలిపారు. క్రాఫ్ట్ వర్క్, హౌస్ వర్క్, వంటి ఎన్నో కార్యక్రమాలతో విద్యార్థు లకు విద్య అందిస్తున్నట్టు తెలిపారు. ప్రైమరీ తరగతులు.. వారి ఉన్నత చదువులకు పునాది వంటివని, కావున పిల్లలకు అర్థమయ్యే రీతిలో సులభతర పద్ధతుల్లో విద్యాబోధన చేపడుతున్నట్టు తెలిపారు. బ్రిలియంట్ పీపుల్ స్కూల్ విద్యతోనే విద్యార్థులు బేసిక్ ను, క్రమశిక్షణ పటిష్టంగా నేర్చుకుని ముందుకు వెళ్తున్నారని తెలిపారు. పండుగల ప్రాధాన్యత, ఆచార్య సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తు న్నామని, విద్యార్థులను సైతం భాగస్వామ్యం చేస్తున్నట్టు తెలిపారు.

బడిబాటకు అపూర్వ స్పందన

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే అడ్మిషన్లు తీసుకుందామన్నా అవకాశం లేకుండా పోయింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 25 కేజీబీవీలున్నాయి. అందులో 9 కేజీబీవీలు ఇంటర్ వరకు కొనసాగుతున్నాయి. ఈ 25 కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 6,867 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో తరగతిలో పరిమితికి మించి విద్యార్థినులు అడ్మిషన్లు పొందుతున్నారు. ప్రతి యేడాది కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది. గతేడాది పదో తరగతి పరీక్షల్లోనూ సత్తా చాటారు. మొత్తం 801 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా.. 673 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఆరు కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. అందులో ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, మెండోరా, మోపాల్, ముప్కాల్, వేల్పూర్ కేజీబీవీలున్నాయి. 9.7 జీపీఏ సాధించి సత్తా చాటారు.

విద్యతో పాటు విజ్ఞానం

- క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ పట్టణంలోని చేపూర్ శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న లేట్రల్ ఎంట్రీ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ ని మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ విద్యా సంస్థల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లా డుతూ విద్యతో పాటు విజ్ఞానాన్ని మంచి ప్రవర్తనను సంస్కా రాన్ని అందిస్తున్న విద్యాసంస్థ క్షత్రియ కాలేజీ అని, ఇక్కడి విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడుతు న్నారని వారిలాగే ఇప్పుడు వీడ్కోలును అందుకుంటున్న వారు కూడా ఉన్నంతంగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ ఆర్థిక వ్యవస్థను పెంచే విధంగా, సమాజానికి ఆదర్శం గా నిలవాలని కోరుతూ, ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణ ఇంటర్వ్యూ లో ఎన్నికయిన విద్యార్థులను అభినందిస్తూ వారిని సన్మానించారు. ప్రిన్సిపల్ ఆర్ కే పాండే విద్యార్థుల భవిష్యత్తు అనే ఆశం మీద మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. ఈసీ హెచ్ ఓ డి కైలాష్, అల్జపూర్ వీరేందర్ , అలాగే ఫ్యాకల్టీ పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వేడుకల్లో మాట్లాడుతున్న సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నాయ కులు డిమాండ్ చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్ అజయ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు అందలేదని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నాయని విద్యతో వ్యాపారం చేస్తున్నాయని కానీ విద్యాశాఖ అధికారులకు మాత్రం అవి కనిపించడం లేదని అన్నారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మిస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అల్తాఫ్ నాయకులు మణికంఠ రంజిత్ నవీన్ అర్జున్ పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇంటర్‌లో రోబోటిక్స్ సహా 9 కొత్త కోర్సులు

- ఒకేషనల్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్





తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు టెక్నాలజీ కోర్సులపై ఫోకస్ పెట్టింది. విద్యార్థులకు కొత్త కోర్సులు రాబోతున్నాయి. అవేంటో... పూర్తి వివరాల్ని అర్ధమయ్యేలా తెలుసుకుందాం.టెన్త్ అవ్వగానే ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇలా రొటీన్ కోర్సులు కాకుండా... ఇప్పుడున్న అవసరాలకు తగ్గట్టుగా ఉండే కోర్సులు చె య్యాలను కుంటున్నారా... ఐతే... తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు తీసుకున్న నిర్ణయం తెలుసుకుంటే మంచిది. భవిష్యత్తు మొత్తం టెక్నాలజీ కోర్సులదే అని మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పని లేదు. ఇప్పటికే అలాంటి కోర్సులకు డిమాండ్ బాగా ఉంది. దీన్ని దష్టిలో పెట్టుకొని... టెక్నాలజీపై స్టూడెంట్స్‌కి నాలెడ్జ్ పెంచేందుకు ఇంటర్ బోర్డు... కొన్ని షార్ట్ టెర్మ్ కోర్సులను ప్రవేశపెట్టబోతోంది. ఇవి మొత్తం 9 కోర్సులు ఉన్నాయి. వీటికి సంబంధించి ఆల్రెడీ సిలబస్ రెడీ చేసేసింది. ఈ కోర్సుల సిలబస్‌ను... జనవర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్లకు ఇస్తుంది. వారు దీన్ని మొత్తం పరిశీలిస్తారు. ఎలా ఉందో చూస్తారు. ఏమైనా మార్పులు చేయాలంటే చెయ్యమని చెబుతారు. వేసవి సెలవుల సమయంలో... ఈ మార్పులు జరిగిపోతాయి. సరిగ్గా కాలేజీలు తెరవగానే... కొత్త కోర్సులు పలకరిస్తాయి. అయితే ఇవి సంవత్సరమంతా చదివే కోర్సులు కావు. కొంతకాలమే ఉంటాయి. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన పెరుగుతుంది. ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుంది. స్వల్పకాలిక కోర్సు నచ్చితే... అప్పుడు పూర్తి స్థాయిలో అదే కోర్సును చదివి... అందులోనే ఉపాధి అవకాశాలు వెతుక్కోవచ్చు. అదే ఇంటర్ బోర్డు ఆలోచన.

కొత్త కోర్సుల లిస్టు


1. కృత్రిమ మేధ
2. మెషిన్ లెర్నింగ్
3. రోబోటిక్స్
4. బ్లాక్‌చైన్ టెక్నాలజీ
5. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ
6. కోడింగ్
7. ఎంబెడ్ సిస్టమ్
8. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్
9. ఇండస్ట్రియల్ ఆటోమేషన్

చూశారుగా వీటిలో నచ్చిన కోర్సును మీరు చదువుకోవచ్చు. కచ్చితంగా కెరీర్‌కి ఇవి ఉపయోగపడతాయని అంటున్నారు. ఒక్కో కోర్సు 3 నెలల నుంచి 9 నెలల దాకా ఉంటుంది. కోర్సుల్లో 60 శాతం ప్రాక్టికల్స్, 40 శాతం థియరీ ఉంటుంది. ఫీజు తక్కువగానే తీసుకుంటారని అధికారులు తెలిపారు. ఇంటర్ విద్యార్థులు ఏ గ్రూపు చదువుతున్నా... అదనంగా ఈ కోర్సులు కూడా చేయవచ్చని తెలిపారు. ముందుగా గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో వీటిని ప్రవేశపెడతారు. మున్ముందు ఇవే కోర్సులు పూర్తి స్థాయి కోర్సులుగా మారను న్నాయి. ప్రస్తుతం ఒకేషన ల్‌లో 40 రకాల కోర్సులను చెబుతు న్నారు. ఈ 9 కోర్సులూ విద్యా ర్థుల కు తెలిసి ఉండాలని... టెక్నా లజీ కంపెనీలు కోరుతున్నాయి. టెక్నికల్‌గా మన దేశ విద్యార్థులు మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందంటున్నారు. ఈ కోర్సులకు ఫీజులు తక్కువే కాబట్టి... పేద విద్యార్థులు కూడా వీటిని నేర్చుకొని... భవిష్యత్తుల్లో మంచి ఉద్యోగాలు పొందేందుకు వీలవ్వనుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో

నాణ్యమైన విద్యా బోధన

- మండలంలో 10.10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని
- మెరుగైన ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నాం : ఎంఈవో


హున్స మండల పరిషత్ ఉన్నత పాఠశాల భవనం


10/10 జీపీఏస్ సాధించిన హున్సా పాఠశాల విద్యార్థిని

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ప్రభుత్వం పాఠశాలలకు మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఉన్నతమైన ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షితులవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే సాగనంపుతున్నారు. దానికి నిదర్శనమే బోధన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట పాఠశాల.

ఈ పాఠశాలలో ప్రతి సంవత్సరం 800కు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సమీపంలోనే ఎన్నో ప్రైవేట్ పాఠశాలలు ఉన్న అధిక శాతం విద్యార్థులు మాత్రం ఈ పాఠశాలలో చేరి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ పాఠశాల విద్యార్థులు బాసర ఐఐటీకి ఎంపికయ్యారు. ప్రస్తుతం సాలూర మండలం మంజీరా పరివాహక గ్రామమైన హున్స మండల పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థిని సిరిసే శ్రావణి 10.10 జీపీఏ సాధించి మండలంలో పాఠశాల పేరును ఉన్నత స్థాయిలో నిలిపారు. ఈ గ్రామం వ్యవసాయ ఆధారిత పంటలకు నిదర్శనం. ముఖ్యంగా అధికశాతం రైతులు ఉన్నా గ్రామంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్ ఎంతో కృషి చేస్తున్నారు. 2022 సంవత్సరానికి గాను ఈ పాఠశాలలో 9.5 జీపీఏ ఆరుగురు విద్యార్థులు సాధించగా, ఒకరు 10.10 జీపీఏ సాధించారు. అలాగే బోధన్ మండలంలోని మారుమూల గ్రామం అయిన కొప్పర్గాలో ఉన్న మండల పరిషత్ ఉర్దూ మీడియం హైస్కూల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ పాఠశాల మండలంలోని 100శాతం ఫలితాలను సాధించింది. బోధన్ ఉమ్మడి మండలంలో మొత్తం 22 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. అందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 7, జిల్లా పరిషత్ హైస్కూల్ 11, సంక్షేమ గురుకులాలు హైస్కూలు 4 ఉన్నాయి.

100శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఉన్నత ప్రమాణాలతో సకల సౌకర్యాలు కల్పించడంతో రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతి హై స్కూల్ ద్వారా 100శాతం ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం. అంతేకాకుండా ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నాం. మన ఊరు మనబడి ద్వారా ప్రభుత్వం కాగిత రహిత డిజిటల్ విద్యా విధానం అమలు చేయడం ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే అవకాశం కలిగింది. దాంతో వచ్చే విద్యా సంవత్సరానికి తప్పనిసరిగా 100శాతం ఫలితాలను సాధిస్తాం. విద్యార్థులు అదే స్థాయిలో కష్టపడి చదవాలి.

- ఎంఈఓ నాగనాథ్

తల్లిదండ్రులు విద్యార్థులకు సమయాన్ని కేటాయించాలి

- అభ్యాస స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తల్లిదండ్రులు విద్యార్థులతో సమయాన్ని కేటాయించడంతో విద్యార్థులు సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతారని అభ్యాస స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ అన్నారు. నవతెలంగాణ ఎడ్యుకేషన్ ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యాస స్కూల్లో విద్యార్థులకు చక్కటి విద్యా బోధన చేపడుతున్నామన్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని వివరించారు. విద్యార్థులకు లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేపట్టేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలున్నా తమ పాఠశాల ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం తగిన సమయాన్ని కేటాయిస్తూ మంచి సంబంధం కలిగి ఉండాలని, అప్పుడే పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చగలుగుతారని వివరించారు. ఆరో తరగతికి చెందిన ఇంద్ర అనే తమ విద్యార్థి ఆల్ ఇండియా లెవెల్లో చెస్ పోటీల్లో గెలుపొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్, సాలూర మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ, 2వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను బోధించే ఉపాధ్యాయులు సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని బోధన్ ఎంఈఓ నాగనాథ్ అన్నారు. సోమవారం బోధన్ ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని పాఠశాలలలో పుస్తక పఠనం నిర్వహించాలన్నారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని ఫండమెంటల్ లిటరేసి అండ్ న్యూమరసి కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని, కత్యాధార బోధన జరగాలని, ప్రతి విద్యార్థి అన్నీ సామర్థ్యాలు సాధించేలాగా ఉపాధ్యాయుల కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల నోడల్ అధికారి నాగయ్య, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు విజయ్, బాబు, శివానంద్ షఫీ, విజయ పాల్గొన్నారు.

ఇదీ విద్యాహక్కు చట్టం

- తెలుసుకుంటే ఎంతో మేలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



అన్నీ చట్టాల కంటే ప్రధానమైనది విద్యా హక్కు చట్టం. ఈ చట్టం గురించి చాలా మందికి అవగాహన ఉండదు. ఈ నేపథ్యంలో విద్యాహక్కు చట్టం గురించి పూర్తిగా తెలుసుకుందాం.

భారతదేశంలోని 6 సంవత్సరాల వయస్సు నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత నిర్భంధ విద్యను అందించడమే ఈ చట్టం ఉద్దేశ్యం. ఈ చట్టం 2010 ఏప్రిల్ 01న అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి విద్యను ప్రతి విద్యార్థికి ప్రాథమిక హక్కుగా అందించే దిశగా ప్రభుత్వం పూనుకుంది.

బాల కార్మికులు, వలస వచ్చిన పిల్లలకు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను ఆర్థిక, భౌగోళిక, భాష, లింగపరంగా ఏటువంటి కారణం వలననో నష్టపోకుండా, పిల్లలు విద్యా నేర్చుకుని ప్రయోజనములు చేకూరే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లతో ఈ చట్టం తయారు చేశారు. విద్యాహక్కు చట్టంలో ఒకటో తరగతి, అంతకన్నా ముందు (ప్రీప్రైమరీ) తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎటువంటి పరీక్షలు చేయకుండానే ప్రవేశం కల్పించాలని, విద్యాహక్కుచట్టం ప్రకారం అన్ని అన్‌ఎయిడెడ్, ప్రత్యేక విభాగపు పాఠశాలల్లో కనీసం 25 శాతం (అనాథలు, హెచ్ఐవీ బాధితులు, వికలాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, వార్షికాదాయం రూ.60 వేలు లోపున్న బీసీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులకు 6 శాతం) సీట్లను సమీప ప్రాంతాల్లోని నిరుపేద, బలహీనవర్గాల పిల్లలకు ఉచితంగా సీట్లు కేటాయించి, ప్రాథమిక విద్య పూర్తయ్యేంత వరకూ చదువు చెప్పాలి. మిగిలిన 75 శాతం సీట్లు సహేతుక విధానాన్ని అనుసరించాలి. తల్లిదండ్రుల విద్యార్హతల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని లెక్కించే పద్ధతి మానుకోవాలని, ప్రవేశ ప్రక్రియ వివరాలను బహిరంగంగా అందరికీ వెల్లడించాలి. సర్కారీ సీట్లు లేకుండా ప్రైవేటు విద్య నేరుగా చేరితే విద్యాహక్కు వర్తించదు. విద్యా హక్కు చట్టాన్ని అమలుచేయడానికి రాష్ట్రాలు ఆమోదించి నట్లయితే దేశంలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తారు.

ఎనిమిదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక విద్య పూర్తయినట్లు ధ్రువీకరణపత్రం అందించాలి. బాలల విద్యా హక్కుల పరిరక్షణకు గాను విద్యాహక్కు సంరక్షణ సంస్థను సెప్టెంబరులో ఏర్పాటు చేయాలి. చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సలహాలు ఇచ్చేందుకు ఓ సలహా సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

పిల్లలను పాఠశాలలో అడ్మిషన్ చేసే సమయంలో ఏ పాఠశాల అయినా, ఏ వ్యక్తి అయినా ఏ రకమైన ఫీజును వసూలు చేయడాన్ని, ఆ పిల్లలకు లేదా వారి తలిదండ్రులకు లేదా సంరక్షకులకు ఎలాంటి ఎంపిక పరీక్ష నిర్వహించవద్దు. ఏదైనా పాఠశాల, వ్యక్తి ఫీజు వసూలు చేస్తే, ఆ ఫీజు కు పదిరెట్లు జరిమానాతో శిక్షిస్తారు. పాఠశాలలో అడ్మిషన్‌కు ముందు పిల్లలను ఏదైనా అర్హత పరీక్షలు నిర్వహిస్తే మొదటిసారి నిబంధన ఉల్లంఘించినందుకు రూ.25,000, ఆ తర్వాత ప్రతి ఉల్లంఘనకు రూ.50,000 వంతున జరిమానా విధింపబడుతుంది.

పోటీ పరీక్షలకు కేరాఫ్ 'తను ట్యుటోరియల్'

- సరైన సాధనాలే విజయానికి సోపానాలు
- నవోదయ, సైనిక్, గురుకుల, పాలిటెక్నిక్‌తోపాటు పోటీ పరీక్షలకు శిక్షణ
- జవహర్ నవోదయ 2023లో ముగ్గురు ఎంపిక
- ప్రత్యేక మెలుకువలతో శిక్షణ
- గ్రామీణ, పేద విద్యార్థులకు వరం

విద్యాభ్యాసంలో సరైన సాధనాలను ఉపయోగిస్తూ విజయాల పరంపరను నవీపేట్ మండలకేంద్రంలోని "తను ట్యుటోరియల్" కొనసాగిస్తుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే చదువులో మెలుకువలు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం మూడీ చదువులు విద్యార్థులకు ఏ విధంగాను ఉపయోగపడక భవిష్యత్తు ప్రశ్నార్థకంలోనే ఉంటుంది. కాబట్టి చిన్న వయస్సులోనే చదువు పట్ల ఆసక్తి ఇష్టాన్ని పెంచి, తరగతికి తగ్గట్టు విజ్ఞానాన్ని అందిస్తూ, అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఒక్కో మెట్టు ఎదిగితేనే విజయాలు సాధ్యమవుతాయని తను ట్యుటోరియల్ డైరెక్టర్ సంతోష్ కుమార్ నిరూపిస్తున్నారు.

నవతెలంగాణ-నవీపేట్



కేంద్ర విద్యా శాఖ నిర్వహించే జవహర్ నవోదయ సైనిక్ ప్రవేశాలకు తీవ్రమైన పోటీ ఉంటుంది. ఈ పరీక్షల్లో అర్హత సాధిస్తే చాలు ఇంటర్ వరకు ఉచితంగా చదువు, వసతి, భోజనంతో పాటు అత్యున్నత ప్రమాణాలతో బోధన ఉంటుంది. దీంతో విద్యార్థి భవిష్యత్తుకు భరోసా ఉండడంతో తల్లిదండ్రులు ఈ పరీక్షలపై ఆసక్తి చూపిస్తారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ గురుకుల, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోసం ప్రత్యేకంగా పట్టణాలలో కోచింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న వాళ్లకు గ్రామీణ ప్రాంతంలోనే పేద మధ్యతరగతి కుటుంబాలకు తను ట్యుటోరియల్ వరంగా మారిందని భావిస్తున్నారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 50 మంది విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధం చేసి మంచి ఫలితాలను సాధించారు. జవహర్ నవోదయ 2023లో 6వ తరగతి ఎంట్రన్స్‌లో రిమ్మ తేజస్విని, ధీరజ్ ఎంపిక కాగా 9వ తరగతిలో జిల్లాలోనే ఒకే అంకె పోటీలో కృతి సహస్ర ఎంపిక కావడం గొప్ప విజయంగా ప్రశంసలు అందుకున్నారు. 2021-22లో ఐదవ తరగతిలో సాయి విఘ్నేష్ ఓపెన్ కేటగిరీలో సీటు సంపాదించి అందరి చూపును ఆకర్షించారు. అలాగే సైనిక్ స్కూల్లో ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించారు గురుకులంలో ఒక్కరు, పాలిటెక్నిక్ 16 మంది విద్యార్థులు ఎంపిక కావడమే గాక పాలిటెక్నిక్ కోర్సుల్లో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషన్ ఇంటిలిజెన్స్, ఎంబిడెడ్ సిస్టం లాంటి వినూత్న గ్రూపులను ఎంపిక చేసుకొని ఐఓఈఎస్ సికింద్రాబాద్ కళాశాలలో సీట్లు పొందడం విశేషం. అంతేకాకుండా ఒక్కో విద్యార్థి ఒకే అటెంప్ట్ లో రెండు ఎంట్రెన్స్‌ల్లో సీట్లు సాధిస్తుండడం వారి నైపుణ్యతకు కొలమానంగా భావించవచ్చు. కేవలం 20 నెలల వ్యవధిలోనే సుమారు 50 మంది విద్యార్థులు విద్యలో మంచి ప్రావీణ్యాన్ని పొంది ఉన్నత భవిష్యత్తు దిశగా ప్రయాణిస్తుండడం తను ట్యుటోరియల్ వాస్తవిక విజ్ఞానాన్ని అందిస్తుందనడానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

ప్రత్యేకతలు

తను టుటోరియల్ వ్యవస్థాపనకు డైరెక్టర్ సంతోష్ కుమార్ విద్యపట్ల ప్రత్యేకమైన ఆలోచన, అనుభవాలు మరియు సాధించిన విజయాలే అని చెప్పవచ్చు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 2019 సందర్భంగా 10 వేల మందితో నిర్వహించిన లార్జెస్ట్ మెంటల్ హెల్త్ వీర్ గ్రూప్ కౌన్సిలింగ్ సెషన్‌లో సీనియర్ కౌన్సిలర్ అవార్డును ప్రఖ్యాత సైకాలజిస్ట్ డాక్టర్ గీతా చల్లా చేతుల మీదుగా అందుకున్నారు. విశ్వతేజస్ పర్సనాలిటీ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా లైఫ్ స్కిల్ ట్రైనర్‌గా అవార్డు పొందారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అబ్దుల్ కలాం ఎక్సెన్సీ అవార్డు 2021 అక్టోబర్ 15న పొందారు. అలాగే జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అవార్డు- 2019లో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రీం టీచర్‌గా మన్ననలు పొందారు. ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్ అండర్ యాస్ ఏ సీనియర్ కౌన్సిలర్. ఇవే కాకుండా అనేక ప్రశంసా పత్రాలు పొంది ప్రత్యేక ఆలోచన విధానంతో బట్టి చదువులకు స్వస్తి పలికించడంలో నిష్ణాత్తులుగా మారి విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచి స్వయం నైపుణ్యతను సాధించే విధంగా కృషి చేస్తున్నారు.

గణిత అధ్యాపకులు అశోక్ కుమార్ ప్రేరణతోనే...

సంతోష్ కుమార్, ఎంఏ, బీఈడీ,డి ఈ డి, లైఫ్ స్కిల్ ట్రైనర్



నిజామాబాద్‌లోని ప్రభుత్వ డైట్ శిక్షణ కేంద్రంలోని సీనియర్ గణిత అధ్యాపకులు పి అశోక్ కుమార్ విద్యా బోధన భావనలతో ప్రేరణ కలగడం మిత్రుడు జనార్ధన్ తోడ్పాటుతో గణితంపై పట్టు సాధించడంతో ప్రస్తుత విద్యార్థుల్లో బట్టి చదువుల మూసను తొలగించేందుకే ట్యుటోరియల్ ఏర్పాటు. చదువుకి, భవిష్యత్తుకు ర్యాంకులు కొలమానం కాదని కేవలం మేధస్సు,పరిజ్ఞానంపై ఉంటుందని తల్లిదండ్రులు గ్రహించాలి. సంపూర్ణ, సమగ్ర, మూర్తిమత్వ వికాసం చెందితేనే మంచి భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుంది. తల్లిదండ్రుల అవగాహనలేమి విద్యార్థులకు శాపంగా మారకుండా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై విద్యార్థి స్వయంగా కృషి చేసేలా నైపుణ్యతను సాధించేలా కృషి చేస్తున్నాం.

విద్యార్థుల భవితకు బ్రాండ్ స్మైల్స్ పాఠశాల

- సీబీఎస్ఈ సిలబస్
- ఉత్తమ పాఠశాల జాతీయ పురస్కార్ అవార్డు



బొమ్మలతో ఆడుకుంటున్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ విద్యానగర్ కాలనీలోగల స్మైల్స్ పాఠశాల అందరి మదిని దోచేస్తుంది. చూడగానే మైమరిపించే వాతావరణం, స్వచ్ఛత, పరిశుభ్రతకు మారుపేరుగామారి స్మైల్ పాఠశాల ప్రత్యేకతను సంతరించుకుంది. చిన్న పిల్లలకు ఆటపాటలతో పాటు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడం వారి తల్లిదండ్రులకు సైతం ప్రోత్సహించడం, ఆకర్షణీయమైన, అందమైన బొమ్మల మధ్య విద్యార్థులకు చదువు నేర్పడం స్మైల్ పాఠశాల ప్రత్యేకత. ఏసీ తరగతులతో '20 మంది విద్యార్థులతో ఒక తరగతి నిర్వహిస్తూ సీబీఎస్ఈ సిలబస్‌తో ఉత్తమ పాఠశాల జాతీయ పురస్కార్ అవార్డు అందుకుంది. పాఠశాల కరస్పాండెంట్ షబానా గోహర్ నిర్విరామ కృషి. ఎక్స్క్యూసివ్లి ఫర్ కిడ్స్ నర్సరీ నుండి ఏడో తరగతి వరకు కలర్ ఫుల్ క్లాస్ రూమ్స్, లవింగ్ అండ్ కేరింగ్, అనుభవగ్నులైన టీచర్లు. ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రీమియం ఆర్గనైజేషన్ బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్‌తో అనుసంధానం చేసుకొని నేటి విద్యార్థులకు కావలసిన యాక్టివిటీస్, సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నారు. వారం వారం, నెలవారీగా ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. 100శాతం మదర్ అండ్ సిస్టర్ కేరింగ్ ఉంటుంది. సెమినార్స్ వర్క్‌షాప్స్ కండక్ట్ చేయడం జరుగుతుంది. విద్యార్థుల ఇంట్రెస్ట్‌ను బట్టి వారి వారి సబ్జెక్టును బట్టి ఫీల్డ్స్ ట్రిప్స్ కూడా నిర్వహిస్తున్నారు. నేడు ఆర్మూర్‌లో ఒక బ్రాండ్ లాగా పేరు పొందగలిగింది స్మైల్ పాఠశాల. ఉత్తమ పాఠశాలగా ప్రముఖ సినీ నటుడు సుమన్‌తో అవార్డు సైతం పాఠశాల అందుకుంది. 7013967007, 8008888388 నెంబర్లకు సంప్రదించవచ్చు.



అవార్డు అందుకుంటున్న స్మైల్స్ పాఠశాల డైరెక్టర్



భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు..

- రఫీ గోహార్, స్మైల్స్ పాఠశాల డైరెక్టర్, ఆర్మూర్

పిల్లలకు చిన్ననాటి నుంచే వినూత్న ఆవిష్క రణలకు నాంది పలికితేనే భవిష్యత్తులో ఎదిగే అవకాశం ఉంటుంది. ఉన్నతులుగా తీర్చిదిద్దడమే మా పాఠశాల లక్ష్యం.

డిప్లొమా కోర్సులకు డిమాండ్

- తొందరగా ఉపాధి అవకాశాలు



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

ఇంటర్ పూర్తై ఏ కోర్సులు చేయాలో తెలియక తికమక పడుతున్న విద్యార్థులకి డిప్లొమా కోర్సులు సూపర్ అని చెప్పవచ్చు. అంతేకాక కొంతమంది తక్కువ విద్యార్హతతో ఉద్యోగం సంపాదించాలనుకుంటే ఈ డిప్లొమా కోర్సులు బెస్ట్ అని చెప్పవచ్చు. ఇక తొందరగా జాబ్ చేయాలనుకుంటున్న వ్యక్తులకి కూడా ఈ కోర్సులు ఉత్తమమైనవని చెప్ప వచ్చు. ఈ డిప్లొమా కోర్సులు చేసిన తర్వాత కోరుకున్న ఉద్యోగాన్ని పొందవచ్చు. మంచి జీతంతో జీవితంలో సెటిల్ కావొచ్చు. ఆ కోర్సులేంటో ఈ రోజు తెలుసుకుందాం.

1. డి ఫార్మాసీ

మీరు వైద్య రంగంలో కెరీర్ చేయాలనుకుంటే మీరు డి ఫార్మా చేయవచ్చు. ఈ కోర్సు చేసిన తర్వాత సొంత మెడికల్ స్టోర్ ఓపెన్ చేసుకోవచ్చు. ఇది కాకుండా మెడికల్ రి ప్రజెంటేటివ్‌గా కూడా పని చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన..!

2. హోటల్ మేనేజ్‌మెంట్

ఇంటర్ పాసైన తర్వాత వెంటనే హోటల్ పరిశ్రమలో వత్తిని చేపట్టవచ్చు. ఇందుకోసం హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా పొందాలి. ఇందులో చేరితే చిన్న వయసులోనే మంచి జీతంతో ఉద్యోగం పొందవచ్చు.

3. కంప్యూటర్ సైన్స్

నేటి కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రావడం చాలా కష్టం. దీనిపై పట్టు సాధిస్తే మంచి జాబ్ లైన్‌లో ఉంటుంది. అందుకే కంప్యూటర్ సైన్స్లో డిప్లొమా తీసుకోవచ్చు.

4. యానిమేషన్ ,మల్టీమీడియా

యానిమేషన్,మల్టీమీడియా ద్వారా మంచి డబ్బు సంపాదించవచ్చు. దీంతో పాటు కెరీర్‌ను గ్రాఫిక్ డిజైనర్‌గా రూపొందించుకోవచ్చు.

5. పాలిటెక్నిక్,ఐటీఐ

పాలిటెక్నిక్, ఐటీఐ చేయడానికి ఇంటర్ పాస్ కావాల్సిన అవసరం లేదు. 10వ తరగతి ఆధారంగా ఈ కోర్సులో చేరవచ్చు. దీనివల్ల తక్కువ సమయంలో మంచి ఉద్యోగం పొందవచ్చు.

6. నర్సింగ్

బాలికలకు ఇది చాలా మంచి ఎంపికని చెప్పవచ్చు. నర్సింగ్‌లో డిప్లొమా చేయడం వల్ల ఏదైనా ఆసుపత్రిలో సులభంగా ఉద్యోగం పొందవచ్చు.

7. ఇంటీరియర్ డిజైనింగ్ ఆర్ట్

డిజైనింగ్ అంటే ఇష్టపడే విద్యార్థులు ఇంటీరియర్ డిజైనర్‌గా కెరీర్‌ను రూపొందించుకోవచ్చు. ఈ రంగంలో పని చేయడం చాలా సరదాగా ఉంటుంది. ఆదాయం కూడా చాలా బాగుంటుంది.

రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్స్ చాలా అవసరం

• స్ప్రింగ్ ఫీల్డ్ ప్రిన్సిపాల్ భార్గవ్


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



విద్యార్థులకు రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా ముఖ్యమని, సిల్వర్ వింగ్స్‌లో తమ ప్రధాన్యత అదే అని స్ప్రింగ్ ఫీల్డ్ ప్రిన్సిపల్ భార్గవ్ తెలిపారు. ప్రీ ప్రైమరీ నుండి 1 వ తరగతి వరకు స్కూల్ విద్యార్థులకు స్కూల్ ఫీజు మాత్రమే తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు తీసుకోబోమని తెలిపారు. నేడు విద్యార్థులకు ముఖ్యంగా చదవడం, రాయడం చాలా అవసరమని అవే విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని అదే చదువు స్టాండర్డ్ ని తెలియజేస్తుందని అన్నారు. తమ స్కూల్‌లో విద్యార్థులకు ముఖ్యంగా రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆక్టివిటీస్ నేర్పించడం జరుగుతుందని, అదేవిధంగా ప్రస్తుత కాంపిటేషన్ యుగంలో ప్రతి ఒక్క విద్యార్థికి స్కిల్ డెవలప్మెంట్, మెక్ యువర్ ఓన్ వాయిస్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, విద్యార్థులకు అవే ముందు ముందు చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఓపెన్ బుక్ టెస్ట్, రీడింగ్ ఫర్ ఎవరీ మంత్ ఇన్ మేనేజ్మెంట్, స్పీకింగ్ స్కిల్స్, లెర్నింగ్ ఫెసిలిటీస్, సెల్ఫ్ అనాలసిస్ లాంటివి విద్యార్థులకు నేర్పిస్తున్నట్టు తెలిపారు.























రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-మద్నూర్

రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మద్నూర్ పాత తాలూకా పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మద్నూర్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రిటైర్డ్ ఉద్యోగులు తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ వేతనం రూ.30వేలకు తగ్గకుండా అమలు చేయాలని, దాదాపు పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉంటున్నాయని వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ఆందోళన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే రామారావు, ఎస్.గంగారం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిబ్బందిని అభినందించిన ఇంచార్జీ సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూటుమెంటు బోర్డు నిర్వహించిన సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియ కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులులేకుండా నిర్వహించినందుకు పోలీస్ కార్యాలయం సిబ్బందిని ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి.హెచ్.ప్రవీణ్ కుమార్ సోమవారం అభినందించారు. హెడ్ క్వార్టర్స్ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది దాదాపు 130 మందికి ప్రశంసా పత్రాలు ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా అదనపు డి.సి.పిలు జి.మధుసుధన్ రావు (అడ్మిన్), గిరిరాజు (ఎ.ఆర్), నిజామాబాద్ ఎ.సి.పి కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, పరిపాలన అధికారి (ఎఓ) బి.శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, సిపిఓ కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలి
- జేఏసీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నినాదాలు చేస్తున్న పంచాయతీకార్మికులు, నాయకులు

గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియం వద్ద కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 50 వేల కార్మికుల్ని వెంటనే క్రమబద్ధీకరించాలని, పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు పోస్ట్ ఆఫీసులో కట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలని, 60 పిఆర్సి ప్రకారం సఫాయి కార్మికులకు 15,600 వేతనం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మోడీ తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయమని రాష్ట్రం అసెంబ్లీ తీర్మానం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ను వారు కోరారు. కార్మికులకు, బట్టలు, చెప్పులు నూనెలు, పరికరాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు దళితులు నిరుపేదలు కనుక వారికి డబుల్ బెడ్రూం పథకంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి అండగా నిలవాలని వారు కోరారు. ప్రజారోగ్యం కోసం తపించి, శ్రమించి పనిచేసే కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిచో 2023 జులై 6 నుండి నిరవేదిక సమ్మెకు దిగవలసి వస్తుందని స్పష్టంచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కి జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఎండి. ఖాజామొయినుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, భానుచందర్, చొప్పరి గంగాధర్ సిఐటియు నాయకులు జంగం గంగాధర్, సాగర్, రాజేష్ గంగారాం, తదితరులు పాల్గొన్నారు. వర్షంలో ప్రదర్శనకు వచ్చిన కార్మికులందరికీ జేఏసీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

కాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే.. మరణాలు తప్పించవచ్చు

- ప్రముఖ వైద్యులు జయని నెహ్రూ
- మల్లుస్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరానికి స్పందన
- నేడు, రేపూ నిర్వహణ

నవతెలంగాణ-కంఠేశ్వర్


వైద్యశిబిరానికి హాజరైన వైద్యులు, వైద్య సిబ్బంది

ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి కాపాడుకోవడానికి ఏకైక మార్గం ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడటమేనని అందుకే ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జయని నెహ్రూ అన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చని ఆమె అన్నారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్, ఆల్ పెన్షనర్స్ యూనియన్ సంయుక్తంగా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని నాందేవ్ వాడలోని ట్రస్ట్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ మెడికల్ క్యాంపును ఆమె ప్రారంభించారు. క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలైన మెమోగ్రఫీ, ఎక్సరే, పాప్సనియర్ తదితర టెస్టులను ఉచితం గా చేశారు. దీనితో పాటుగా బీపి, షుగర్, గుండె వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, డాక్టర్ స్నేహ, తదితర వైద్య సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్యాంపునకు వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు శాస్త్రుల దత్తాద్రిరావు, ప్రధాన కార్యదర్శి కే రామ్మోహన్రావు, కోశాధికారి ఈవిల్ నారాయణ, ప్రసాద్ రావు, అందే సాయిలు, జార్జ్, దీనసుజన, గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. దాదాపు 150 మంది ఈ హెల్త్ క్యాంపులో టెస్ట్స్ ,వైద్యం, చికిత్స పొందారు. అయితే నేడు అర్సపల్లిలో, రేపు నాగారంలోని బహుజన కాలనీలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.


టెస్టులు చేయించుకుంటున్న స్థానికులు

రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు గ్రామంలోనికి రానివ్వం

- రెంజల్ గ్రామ రైతుల రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-రెంజల్

అక్టోబర్ 31, 2015న బందెల రోడ్డు నుంచి దూపల్లి ఎక్స్‌రోడ్డు, మాచాపురం రోడ్డు నిర్మాణాల కోసం రూ.154.65 లక్షల నిధులు మంజూరుకాగా, ఇప్పటివరకు రోడ్డు మరమ్మతులు పూర్తి కాలేదని రైతులు ఆరోపించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసే వరకు బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తమ గ్రామంలోకి రానివ్వమని రైతులు ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ నెల 28 నుంచి రైతులందరూ రిలే నిరాహార దీక్ష చేస్తామని వారు పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి


కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బట్టు విట్టల్ డిమాండ్ చేశారు. సోమవారం ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెద్దమ్మ ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవ యాత్ర నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద దహనం చేశారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల గౌరవాధ్యక్షులు బొల్లారం సాయిలు, లింగంపేట పట్టణ శబరి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దురిశెట్టి అశోక్, ఉపాధ్యక్షులు క్రాంతి కుమార్, చంద్రబాబు, ఈర్ల శ్రీనివాస్, రైని అశోక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పిచ్చికుక్కల దాడులు : ఎమ్మార్పీఎస్


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పిచ్చి కుక్కలు ప్రజలపై దాడి చేసి ప్రజలకు తీవ్రంగా గాయపర్చాయని, ఇది గ్రామపంచాయతీ అధికారులు పాలకవర్గం నిర్లక్ష్యమేనని ఎమ్మార్పీఎస్ నాయకులు విమర్శించారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రామప్రజలు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీకి అధికారులు పిచ్చికుక్కలను నియంత్రించాలని కోరారు. అదేవిధంగా కుక్కల దాడి వలన హాస్పిటల్ పాలైన రోగులను గ్రామ సిబ్బంది సర్పంచ్ పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వారికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రేవార్ బాలు యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కర్రేవార్ మరోతి, కొలావర్ పండరి, గ్రామపెద్దలు కాంబ్లే అశోక్ వాగ్మరే, శ్రీనివాస్, కర్రేవార్ పండరి, కర్రేవార్ శంకర్, కంబ్లే శామ్, వాగ్మారే చందు, కర్రేవార్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. పాత కలెక్టరేట్ మైదానం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా న్యూ అంబేద్కర్ భవన్ వరకు కొనసాగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్, జిల్లా సంక్షేమ ధికారిణి ఎస్.కె. రసూల్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం న్యూ అంబే ద్కర్ భవన్‌లో నిర్వహించిన అవగా హన కార్యక్ర మంలో వక్తలు ప్రసంగించారు. డిసెంబర్ 7, 1987న జరిగిన ఐక్యరాజ్య సమితి 93వ ప్లీనరీ సమావేశం తర్వాత, డిసెంబర్ 13, 1985న చేసిన 40/122 తీర్మానాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాదకద్రవ్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటి వినియోగం వల్ల సమాజానికి కలిగే హాని గురించి వివరించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని "మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం"గా పరిగణించాలని తీర్మానించారని తెలిపారు. వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబానికి, సమాజానికి ఎనలేని చేటు చేసే మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎక్సయిజ్ ఎస్.ఐ మల్లేశ్, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ప్రతాప్, మెప్మా అధికారిణి మాధురి, సి.డబ్ల్యూ.సి. చైర్ పర్సన్ సంపూర్ణ, స్నేహ సొసైటీ సెక్రెటరీ సిద్దయ్య, గాడ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు శోభారాణి, ఏ.పి. ఫోరం అధ్యక్షుడు రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్ పెట్, గోవింద్ పెట్ హరిజనవాడ, చేపూర్, చేపూర్ హరిజనవాడ, మామిడిపల్లి, పెర్కిట్ వడ్డెర కాలనీ , రాజారాం నగర్‌లో రెండు ఉన్నత పాఠశాలను గోవింద్ పెట్, చేపూర్ పాఠశాలలను సోమవారం తనిఖీ చేసినట్టు మండల విద్యాధికారి రాజా గంగారా తెలిపారు. జూలై ఆరవ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ తమ హ్యాబిటేషన్లలో సందర్శించి తల్లితండ్రులతో మాట్లాడి పిల్లలందరినీ బడిలో చేర్పించే ప్రయత్నం చేయాలని ఆదేశించారు.

జూలై 31 వరకు ఒకటి నుంచి పదవ తరగతి వరకు ప్రతి పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. పఠనోత్సవానికి కార్యక్రమ అమలుకు ప్రత్యేక టైం టేబుల్ ఏర్పాటు చేసుకొని తదనుగుణంగా ప్రతి విద్యార్థి కి చతుర్విధ ప్రక్రియలు వచ్చే విధంగా ప్రణాళిక బద్ధంగా బోధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, మాధవరెడ్డి,గంగమని,అనసూయ, పద్మావతి ,విజయసారథి, ప్రసాద్, మధుసూదన్, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత విద్యా సంవత్సరం 8 కోట్ల మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు చెల్లించేంతవరకు కలెక్టరేట్ నుండి కదిలేదిలేదనీ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణీ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు మెరుపు సమ్మె నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికులందరూ కలెక్టరేట్‌కు చేరుకొని వర్షంలో తడుస్తూ ప్రధాన ద్వారం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, జిల్లా కార్యదర్శి పి. హనుమన్లు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్ జిల్లా అధ్యక్షురాలు సాయమ్మ, గంగాధర్, జిల్లా కార్యదర్శి, నాగలక్ష్మి జిల్లా ఉపాధ్యక్షురాలు, భూమయ్య, ఉమా, ఉషారాణి జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర పుస్తకాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పట్టణంలోని ఇస్కాన్ సెంటర్లో జగన్నాథ్ రథ యాత్ర పుస్తకాలను ఇస్కాన్ ప్రభూజీ రమానంద్ రాయ్, జగన్నాథ్ సేవా సమితి ప్రతినిధి లయన్ నివేదన్ గుజరాతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రథయాత్ర నిజామాబాద్‌లో 28న బుధవారం కంఠేశ్వర్ ఆలయ ప్రాంగణం నుండి పులాంగ్ చౌరస్తా వరకు కొనసాగి విజయలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. రథయాత్ర నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఇస్కాన్ వారి అధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు చౌల్ దుర్గాప్రసాద్, నరేష్, కొండల్వడి రాహుల్, సురేష్, గోవర్ధన్, చందన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

నవతెలంగాణ-బాల్కొండ (కమ్మర్‌పల్లి)

మంత్రి ప్రశాంత్‌రెడ్డిపైన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనీల్, బీఎస్పీ నాయకుడు సునీల్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మండల నాయకులతో కలిసి మాట్లాడారు. మంత్రి ప్రశాంత్ రెడ్డిని కించపరిచేలా మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గం అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉంటే వాటితో రావాలని, మీతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మంత్రి ప్రశాంత్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, తమకు రాజకీయ భవిష్యత్తు లేకుండా పోతుందనే భయంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, జడ్పీటీసీ లావణ్య వెంకటేష్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌట్ గంగాధర్, రైతుబంధు జిల్లా సభ్యులు ఆకుల నరేందర్, రైతుబందు మండల అధ్యక్షులు నాగులపల్లి రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ సూరజ్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, ఎంపీటీసీలు రాంరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్కులు పంపిణీ



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పాంగ్ర మాధవనగర్ ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు నోట్ బుక్‌లను లక్ష్మి నరసింహ బుక్ స్టాల్ వారి సహకారంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. నాలుగవ డివిజన్ అధ్యక్షులు నాగళ్ళ శ్రీకాంత్ చౌదరీ, బీసి విభాగం అధ్యక్షులు మల్లెపూల నరసింహ చారీ, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అభిలాష్, దళిత నాయకుడు భీమ్ శంకర్, మీడియా కన్వీనర్ మల్లెపూల నవీన్, ప్రధానోపాధ్యా యులు జనార్ధన్ పంపిణీచేశారు.

దళిత బంధులో ఎమ్మెల్యేల జోక్యం వద్దు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రెండో విడత దళిత బంధు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా ఎమ్మెల్యే లు జోక్యం లేకుండా జిల్లా కలెక్టర్ ద్వారా అర్హులైన నిరుపేదలకు దళిత బంధు పథకం అందించాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు డిమాండ్ చేశారు. కొన్ని నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల సమావేశంలో 35 మంది ఎమ్మెల్యేల వరకు దళిత బంధులో కమిషన్లు తీసుకున్నారని సిఎం చెప్పిన అంశాన్ని గుర్తు చేశారు. రెండో విడత దళిత బంధులో నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రాష్ట్రంలో 119 నియోజకవర్గాలకు 17,700 కోట్లు బడ్జెట్ కేటాయించడం సంతోషియకరమైన విషయం అని అన్నారు.

తొర్లికొండ పాఠశాలలో పఠనోత్సవం



పఠనోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లి కొండ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు సోమవారం పఠనోత్సవం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యా యులు జంగం అశోక్ తెలిపారు. విద్యార్థులు పాఠాలను చదివారు. జూలై 31 తేదీ వరకు పిల్లలకు ధారాళంగా చదవడానికి ప్రణాళిక రూపొందించు కుంటు న్నామని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు స్వరూ పారాణి, గౌతమి పనిశ్రీ తదితరులు ఉన్నారు.

సర్పంచ్ అశోక్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు నీటిపారుదల శాఖ ఉద్యోగుల వినతి
- ఏఈఈ జీ.రాజ్యలక్ష్మిపై దాడిపట్ల ఉద్యోగుల ఆగ్రహం
- దాడిని ఖండించిన ఎంప్లాయిస్ జేఏసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్



నిజామాబాద్‌సిటీ : కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన నీటిపారుల శాఖ అధికారులు, ఉద్యోగులు

సిహెచ్ కొండూరు సర్పంచ్ అశోక్ చేయి చేసుకోవడంపై నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లు సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిపారుదల శాఖకు (ఎంఐ) సోర్స్‌లోని ఆకుల కొండూరు గ్రామ చెరువు ట్యాంక్ వద్ద, ట్యాంక్ బెడ్ నుండి మొరం తవ్వకం, ట్యాంక్ బెడ్ నుంచి తవ్వకాలకు అనుమతిపై ఏఈఈ జీ.రాజ్యలక్ష్మీ ఆరా తీశారు అని అన్నారు. మొరం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులతో కాంపిటెన్షియల్ అథారిటీ నుండి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా, ట్యాంక్ బెడ్ నుండి మొరం తవ్వడంపై అసిస్టెంట్ ఏఈఈ అభ్యంతరం వ్యక్తం చేశారు అని అన్నారు. పనులు నిలిపివేయాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలుపగా సిహెచ్ కొండూరు సర్పంచ్ అశోక్ అక్కడికి వచ్చి వాగ్వాదానికి దిగి, అసభ్య పదజాలంతో బెదిరించి, ఆమెపై దాడికి పాల్పడ్డాడని, అనుచితంగా ప్రవర్తించాడని వారు అన్నారు. గాయపడిన ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. నీటిపారుదల శాఖ ట్యాంకుల నుండి మొరం తవ్వకానికి అనుమతులకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలు, అధికారం లేనందున జిల్లావ్యాప్తంగా వివిధ ట్యాంకుల్లో ఈ రకమైన ఘటనలు జరగకూడదని అన్నారు. నీటిపారుదలశాఖ ట్యాంకుల సంరక్షకుల శాఖ నుంచి అనుమతి తీసుకోకుండా సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులు తమ అనుమతుల మేరకు ఇరిగేషన్ ఇంజనీర్ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని వారు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు సజావుగా విధులు నిర్వర్తించడానికి మార్గదర్శకాలు, నియమాలు, నిబంధనలను రూపొందించాలని కోరారు.

కంఠేశ్వర్ :నీటిపారుదల శాఖ అధికారినిపై దాడి అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంప్లాయిస్ జేఏసీ కమిటీ సభ్యులతో పాటు ఎంప్లాయిస్ జేఏసీ సభ్యులు ఖండించారు. ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో, జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన నీటిపారుదల శాఖ మహిళా అధికారిని రాజ్యలక్ష్మి(ఏ ఈ ఈ) విధి నిర్వహణ లో వుండగా ఏ ఈ ఈ కి ఆటంకం కల్పిస్తూ దాడి చేసిన నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ని ప్రజావాణిలో కలిసి వినతి పత్రం అందజేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారిని శిక్షించే వరకు ఉద్యమం ఆగదని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, మాజీ టీఎన్జీవో జిల్లా కార్యదర్శి, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ సంఘం అమృత్ కుమార్, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బద్రినారాయణ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ ఆర్.అశోక్ కుమార్, టీఎన్జీవో కేంద్ర సంఘ బాధ్యులు పోల శ్రీనివాస్, అర్బన్ యూనిట్ అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నీటిపారుదల శాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పందిరి స్వామి, కె.పిసునీత అధికారులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణికి 141 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 141 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ, ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐడిజెఎన్ రాష్ట్ర కోకన్వీనర్‌గా ఎడ్లసంజీవ్



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్వర్క్ (ఐడిజేఎన్) తెలంగాణ రాష్ట్ర కోకన్వీనర్‌గా ఎడ్ల సంజీవ్ (ప్రజాజ్యోతి, నిజామాబాద్)ఎంపిక అయ్యారని ఆయన సోమవారం తెలిపారు. 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విపంచీ కళా నిలయంలో ఐడిజేఎన్ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఐడిజేఎన్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య నేతృత్వంలో జరిగిన మహాసభలకు ముఖ్య అతిథిగా మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. మహాసభ అనంతరం ఐడిజేఎన్ రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు.

ఏర్గట్లలో చౌకధరల దుకాణం సీజ్



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన అక్కపత్రి శేఖర్(జాన్)నిర్వహిస్తున్న షాప్ నెంబర్ 7 చౌక ధరల దుకాణాన్ని సివిల్ సప్లై శాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. వినియోగదారులకు అందించవలసిన రేషన్ బియ్యాన్ని అక్కపత్రి శేఖర్ ప్రతి నెల సరిగా పంపిణీ చేయకపోవడంతో వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ డీటీలు శ్రీనివాస్, వినోద్, విఆర్ఏలు వెంకటేష్, సందీప్ ఉన్నారు.

ఫోన్‌ను అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ నగరంలోని సంజీవయ్య కాలనీకి చెందిన నవీన్ కుమార్ తన ఫోన్ పోయినట్లు మూడోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోష్‌కుమార్, బాబు, అప్సర్ సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుక్కుని బాధితునికి సోమవారం అందజేశారు. దీంతో బాధితుడు నవీన్‌కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ పోలీసులకు ధన్యవాదాలు తెలిపాడు.

గురుకుల పాఠశాలలో సఖీ శిబిరం



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్‌లోగల సాంఘిక సంక్షేమ కళాశాలలో తొమ్మిది రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి మాధవి లత తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల నుండి సాంఘిక గురుకుల కళాశాలలకు చెందిన 180 మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారని, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తుందని చెప్పారు. కౌమార దశలో ఉన్న విద్యార్థినులు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే విధంగా వారి ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావడానికి కృత్యాల ద్వారా శిక్షణ ఇవ్వడం వారి ముఖ్య ఉద్దేశం. అని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థినులు జీవితంలో తమ కాళ్ళపై తాము నిలబడడానికి, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడానికి వీలుగా, అలాగే ఆంగ్లభాష ప్రావీణ్యం పెంపొందించుకునే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడానికి ఈ శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.ఓమయ్య, పి.నర్సింగరావు మాట్లాడుతూ.. పర్మినెంట్ కార్మికుల అక్టోబర్‌లో రావలసిన సరెండర్ లీవ్ న్క్యాష్మెంట్ డబ్బులు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులందరికీ చెప్పులు, సబ్బులు, నూనెలు, టవెల్స్, పనిముట్లు అందరికీ ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు 26వేల వేతనం పెంచాలని, ఎన్ఎంఆర్ కార్మికులను 212 జీవో ద్వారా పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ డిటిఓ మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసమ్మ, నర్సింలు, సాయి, సుజాత, లలిత, రాజేందర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంచిర్యాల రాము, పంచాయతీ పాలకవర్గం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇట్టెడి మోహన్ రెడ్డి, శ్రీ సుధాకర్ రెడ్డి, శంకురి ముత్యం రెడ్డి, టేకు సాయిలు, సంతోష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు అంగరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ సోమవారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం అంగరి శ్రీనివాస్ గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ సోమవారం మృతుని సోదరులను, కుమారులను, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట నల్లమోహన్, శైలేందర్, సునీల్ సేన సభ్యులు పాలేపు నరసయ్య, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని కుప్కల్ గ్రామానికి చెందిన ఫ్యాట్ల గంగయ్య కుటుంబానికి ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి 10 వేల రూపాయలు ఆర్థికసాయంగా అందజేశారు. గంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో సోమవారం సునీల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేసి భవిష్యత్తులో సాయం చేస్తానని హామీ ఇచ్చారు . ఈయన వెంట సునీల్‌యువసేన నాయకులు ఉన్నారు.

మామిడిపల్లిలో మలేరియా మాసోత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు ఏర్పడి దోమ లార్వా వృద్ధి చెంది మలేరియా డెంగ్యూ చిక్కునుగున్యా ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. ఇంటి ఆవరణలో చుట్టూ ప్రదేశాలలో పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, కూలర్లు పాత వస్తువులను ఉంచుకోవద్దన్నారు. వారానికి ఒక్కసారి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రవీందర్ ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు నవ్య, రమ, శిరీష ,సుభద్ర మమత తదితరులు పాల్గొన్నారు.

ఉపా కేసును ఎత్తివేసి, చట్టాన్ని రద్దు చేయాలి

- హోంమినిస్టర్‌కు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుల వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్గోట్ రవీందర్ న్యాయవాదిపై తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో పెట్టిన ఉపా కేసుని ఎత్తివేసి, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర హోం మినిస్టర్ మహ్మద్ మహమూద్ అలీకి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో సిపిఐ(ఎం-ఎల్) ప్రజాపంథా రాష్ట్ర బృందం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, రాయల చంద్రశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి వి.ప్రభాకర్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి ఉపా చట్టాన్ని రద్దు చేయాలని కోరారు.

14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడిన 28 మందిపై కేసు నమోదు చేసుకొని వారికి సోమవారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో మద్యం కౌన్సెలింగ్ నిర్వహించారు.

కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ర్యాలీ, దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-భీంగల్/కమ్మర్‌పల్లి



భీంగల్: వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్‌లను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణకేంద్రంలో బస్టాండ్ నుండి బడా భీంగల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ... మీడియా సోదరునిపై దాడి చేస్తు ముదిరాజ్ కులస్తుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీనుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈర్యాలీలో మండల నాయకులు లింగం, సాయిలు, రమేష్, సదాశివ్, శ్రీను, సాయిబాబా,సాయిరాం, జగన్, గంగాధర్, మండల ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

పాడి కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

కమ్మర్‌పల్లి :బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉండి జర్నలిస్ట్‌పై దాడి చేయడమే కాకుండా యావత్తు రాష్ట్ర ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి బేషరతుగా ముదిరాజు కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలిపారు. ఆయన్ను వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించి, పార్టీ నుండి సస్పెండ్ చేసి సీఎం కేసీఆర్ తన చిత్తశుద్ధి ని నిరూపించుకోవాలన్నారు.

డివి కృష్ణకు ఘన నివాళ్లు



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా పార్టీ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ నివాళ్లుఅర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ కామ్రేడ్ డీవీ కృష్ణ జీవితాంతం విప్లవోద్యమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, అంటరాని తనం నిర్మూలనకు పోరాటాలు చేశారన్నారు. పార్టీ, రైతు కూలీ ఉద్యమాల నిర్మాణాన్ని తీర్చిదిద్దారన్నారు. డీవీకే ఆశయాల వెలుగులో పయనించడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, డివిజన్ సహాయ కార్యదర్శి సాయ గౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, డిచ్ పల్లి మండల కార్యదర్శి బి. మురళి, మోపాల్ మండల కార్యదర్శి డి. గంగమల్లు, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సంధ్యారాణి, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, నగర అధ్యక్షులు అషుర్, నాయకులు పాల్గొన్నారు.

వీడీసీ అధ్యక్షునిగా కోతి శేఖర్ రెడ్డి



నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామా అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా సోమవారం కోతి శేఖర్ రెడ్డి ఏకగ్రీవమైనట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు తమపై నమ్మకంతో అధ్యక్ష పదవిని ఏకగ్రీవంగా అందించినందుకు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు, గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అర్జున్, సలహాదారునిగా గోషికొండ అశోక్, సభ్యులుగా సయ్యద్ అలీ, వడ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుండి ఆరుగురు అమ్మాయిలు 13వ జాతీయస్థాయి జూనియర్ హాకీ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని హాకీ సంఘం జిల్లా అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్, సోమవారం తెలిపారు. 2022 అక్టోబర్ 29,30,31న ఆర్మూర్‌లో జరిగిన రఘురాం మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ గర్ల్స్ హాకీ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు మొదటి స్థానం కైవసం చేసుకోవడంతోపాటు ప్రతిభ కనబరిచారు. దార్ల ప్రీతి, గంగాధరి రోహిణి ప్రియ, సుజిత, శ్రీ చందన, వెన్నెల, మమత జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు 13వ హాకీ ఇండియా జూనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్షిప్ రూర్కెల ఒడిస్సా రాష్ట్రంలో వీరు పాల్గొంటారని అన్నారు.

మద్యం షాపుల వద్ద పర్మిట్ రూంలను నియంత్రించాలి

- బహుజన మహిళా సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం షాపుల వద్ద పర్మిట్ రూములను నియంత్రించాలని బహుజన మహిళా సంఘం (బిఎంఎస్) రాష్ట్ర కన్వీనర్ సబ్బనిలత డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లోగల బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) జిల్లా కార్యాలయంలో జరిగిన బహుజన మహిళా సంఘం (బిఎంఎస్) జిల్లా కమిటి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాయకష్టంచేసే ప్రజలను మద్యానికి బానిసలుగా తయారు చేసిందని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో మద్యంపై ఆదాయం 7వేల కోట్ల రూపాయలు వస్తే స్వరాష్ట్రంలో ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చి దాదాపు 27వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చు కుంటుందని ఆమె తెలిపారు. ప్రతి మద్యం షాపు పక్కనే పర్మిట్ రూంల పేరుతో కల్లు బట్టి లాగా వందలాది మందితో ఉదయం నుండి రాత్రి 11వరకు మ్యదం షాపులు, మరోవైపు ఎలాంటి పర్మిషన్ లేకుండా వేలాది బెల్ట్ షాపులను ఎక్సైజ్ శాఖ అధికారుల సహకారాలతో నిర్వహిస్తున్నారని అన్నారు.వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం బహుజన మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా గీతాంజలి, ప్రధాన కార్యదర్శిగా దండు జ్యోతి, ఉపాధ్యక్షురాలు ఆకుల సుజాత, సహాయ కార్యదర్శి ఎం.శోభ, కమిటి సభ్యులు పద్మ విఠ్ఠం లావణ్య, పి.సునీత,సమీన, జి.లావణ్య, జి. దివ్య, వేల్పూర్ నీలా, ఎన్.సంగీత, శారద ఎన్నికయ్యారు.

కల్యాపూర్‌లో రెండు పడకల గదులను అర్హులకే కేటాయించాలి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి అయ్యిందని, వాటిని నిజమైన నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో సర్వే చేసిన జాబితాలో అనర్హులకే ప్రాధాన్యత ఇచ్చారని, నిజమైన నిరుపేదలను గుర్తించి వారికి రెండు పడకల గదిలో కేటాయించాలని వారు వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బండారి పోశెట్టి, కిన్నెర మోహన్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ కేర్ మేనేజర్ అంగోత్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ.. పరీక్షల శిబిరాలను భవన నిర్మాణ కార్మికులు ఇతర రంగ నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ కేర్ ఉచిత ఆరోగ్య శిబిరంలో మద్నూర్ మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు మారాడువార్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సంతోష్, వైద్యులు, వైద్య సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో బిజీబీజీ


విత్తనాలు వేస్తున్న రైతులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీ అయ్యారు. శనివారం నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, చిరుధాన్యాలు వేస్తున్నారు. భారీ వర్షాలు కురువకున్నా.. రైతులు తొలకరి వర్షాలకే పంటలు వేస్తున్నారు. మెజార్టీ రైతులు ట్రాక్టర్‌లతోనే పంటలను సాగుచేసి విత్తనాలు వేస్తున్నారు. ఎద్దులతో వ్యవసాయ పనులు చేయడం కనిపించడం లేదు. ట్రాక్టర్‌తో పంటలు వేయడానికి పత్తికి ఎకరానికి రూ.1000 తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు.

జానకంపేట్ చెరువులో గుర్తు తెలియని శవం లభ్యం



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ చెరువులో గుర్తు తెలియని శవం లభ్యమైనట్టు ఎస్సై పాండేరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యక్తి (50-60) మృతదేహం ఉన్నట్టు సమాచారం రాగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఒంటిపై తెల్ల చొక్కా, ధోతి ధరించి ఉన్నాడు. కాగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అడవి పందుల వేటగాళ్ల అరెస్ట్

నవతెలంగాణ-వర్ని

అటవీ పందుల వేటగాళ్లను ఫారెస్టు అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఫారెస్ట్ అధికారి ఎంఏ హబీబ్ వివరాల ప్రకారం.. కొంత కాలం నుంచి అటవీలో అడవి పందులను వేటాడుతూ వాహనాలలో రాత్రి వెళ్లి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఆదివారం మారుతి వ్యాన్‌లో ఇద్దరు వ్యక్తులు దేవరాజుల జంపయ్య దేవరాజుల శివక్రిష్ణ, అడవి పందులను వేటాడి, వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా ఖండేగావ్ చెక్ పోస్ట్ వద్ద అటవీ అధికారులు పోలీసుల సహకారంతో పట్టుకుని అటవీ క్షేత్రాధికారి కార్యాలయం, వర్నికి తరలించారు. అటవీ అధికారులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు చంద్రప్రకాష్, బాసిత్ అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృత్యువాత

- భయాందోళన తండావాసులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సూరయిపల్లి తండా సమీపంలో సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన డాక్టర్ మౌలానాకు చెందిన మేకపై నంద్యాల కుంట వద్ద చిరుత దాడి చేయడంతో మేక అక్కడికక్కడే మృత్యువాతపడింది. వివరాలిలా ఉన్నాయి.. రోజువారీగా సూరాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు మేకలను మేకల కాపరి రోజువారీగా అటవీ ప్రాంతానికి మేత కోసం వెళ్లగా నందియా నాయక్ గుంట వద్ద మేకల మేస్తుండగా చెట్ల పొదల నుంచి చిరుత పులి మేకల మంద పై దాడి చేయడంతో మేకలు చెల్లు చెదురయ్యాయి. ఓ మేకపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది.

బోర్ మోటార్ ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని జిత్య తండాలో ఎంపీటీసీ బత్తుల పార్వతి బోర్ సోమవారం వేయించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బత్తుల పార్వతి మాట్లాడుతూ జిత్య తండాలో తాగునీటి సమస్య ఉన్నందున ఎంపీటీసీ నిధుల నుంచి బోరు వేయించినట్లు తెలిపారు. బోర్ మోటార్ వేయటం వల్ల తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రాసన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన అక్షరాభ్యాసం చేసినట్లు సర్పంచ్ గుండెల్లి సాయిలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలివెళ్లిన సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు

నవతెలంగాణ-రెంజల్

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతిని మండలంలోని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు సోమవారం హైదరాబాద్ తరలివెళ్లారు. హైదరాబాద్ వెళ్ళిన వారిలో డివిజన్ నాయకులు డి.రాజేశ్వర్, నరేందర్, గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్న, పార్వతీ రాజేశ్వర్, ఓడ్డెన్న, ఎస్‌కే నసీర్, తదితరులున్నారు.

విత్తనాల షాపుల నుంచి శాంపిల్ సేకరణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో ఉన్న విత్తనాల షాపుల నుంచి పత్తి, వరి ఇతర విత్తనాలను మండల వ్యవసాయ అధికారి రాధా శాంపిల్ సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాల శాంపిల్ సేకరించి నాణ్యమైన విత్తనమా కాదా అని ల్యాబ్‌లో పరిశీలించనున్నట్టు తెలిపారు. నాసీరకం విత్తనం అని ల్యాబ్‌లో తేలిస్తే కంపెనీపై చర్యలు తీసుకుంటామని సూచించారు. ప్రతి రైతుకు విత్తనాలు విక్రయించే సమయంలో బిల్లులు అందజేయాలని, విక్రయించిన విత్తనాల, మందుల వివరాలు రికార్డులో నమోదు చేయాలని సీడ్స్ షాప్ యజమానులకు సూచించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ కాలువల పరిశీలన

నవతెలంగాణ-నసురుల్లాబాద్/కోటగిరి


నసురుల్లాబాద్ : కాలువను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని, రైతులు రెండు పంటలను సాగు చేసుకోవచ్చని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి భరోసానిచ్చారు. ఆదివారం బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ, నసురుల్లాబాద్ మండల పరిధిలో ఉన్న నిజాంసాగర్ ప్రధాన డిస్ట్రిబ్యూటర్ కాలువలను పరిశీలించారు. బాన్సువాడ నియోజకవర్గంలో గత రెండు వారాలుగా వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. వానాకాలం పంట ముందస్తుగా వేసుకోవాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించడంతో జూన్ రెండవ వారంలోనే బాన్సువాడ, నసురుల్లాబాద్, వర్ని, కోటగిరి, బీర్కూర్ మండలాల్లో వరినాట్లు ప్రారంభం కావడంతో రైతులకు కావాల్సిన సాగునీటి సౌకర్యాలపై స్పీకర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సోమవారం నిజాంసాగర్ ప్రధాన కాలువలను పరిశీలించారు. నిజాంసాగర్ 25వ డిస్ట్రిబ్యూటర్‌ను పరిశీలించి అక్కడ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఐదు టీఎంసీల సాగునీరు ఉందని వరి నాట్ల కోసం మూడు టీఎంసీల సాగునీరు ఉపయోగపడుతుందన్నారు. అలాగే మరో అయిదు టీఎంసీల సాగునీరు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. టీఎంసీల నీరు కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి గానీ, సింగూర్ ప్రాజెక్ట్ నుంచి గానీ విడుదల చేసి నిజాంసాగర్ నింపుతామన్నారు. గతంలో ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలంటే సీఎం ఆఫీస్ చుట్టూ చెప్పులరిగేలా తిరిగే పరిస్థితులు ఉండేవని, సీఎం కేసీఆర్ చొరవతో ప్రస్తుతం సరైన సమయంలో నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, సాగునీటి రంగాల్లో 70ఏండ్లలో సాధించని ప్రగతిని, గత 9ఏండ్లలో సాధించామన్నారు. 2014లో రాష్ట్రంలో 36 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కాగా, నేడు 3 కోట్లకు చేరిందన్నారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి రాష్ట్రంలో ఉన్న రైస్ మిల్లుల కెపాసిటీ సరిపోవడం లేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వమే అతిపెద్ద రైస్‌మిల్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ రైస్ మిల్లుల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్య విఠల్, పార్టీ అధ్యక్షుడు పేర్క శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్‌మెంబర్ మజీద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేష్, సొసైటీ చైర్మన్ సుధీర్ బాబు, మారుతి పటేల్, గంగారం, నాయకులు సాయగౌడ్, మైస గౌడ్, పురం వెంకటి, సాయిలు యాదవ్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్..

కోటగిరి : రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరి ఉమ్మడి మండల రైతులతో నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ 28 కెనాల్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా జూన్ 21న నిజాంసాగర్ నీటిని విడుదల చేశామని ముందస్తుగా రైతులకు వరి నాట్లు మొదలు పెట్టాలని ఆదేశించడంతో నీటిని విడుదల చేశామని తెలిపారు. ముందస్తుగా వరి నాట్లు వేయడం వలన ప్రకృతి వైపరీత్యాలు, వడగండ్ల నుంచి కొంతమేర ఆర్థిక నష్టం తగ్గుతుందని జూలై మొదటి వారం లాగా వరి నాట్లు పూర్తిచేయడంతో అక్టోబర్ కల్లా పంట చేతికి వస్తుందని తెలిపారు. నవంబర్లో నారు పోసుకొని వరి నాట్లు ప్రారంభించడం వల్ల మార్చిలో పంట చేతికి వస్తుందని ఏప్రిల్, మే నెలలో ప్రకృతి వైపరీత్యాలకు రైతుల నష్టపోకుండా ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నిజాంసాగర్ ఆయకట్టు రైతుల పరిస్థితి తెలపడంతో ముందస్తుగా నీటిని విడుదల చేయడానికి అనుమతిచ్చారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రైతు బాంధవుడని తెలిపారు. రహదారులపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరిగితే వెంటనే ట్రాక్టర్‌ను సీజ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటగిరి మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, ఇరిగేషన్ ఎస్ఈ వసంతి, ఈఈ రాజశేఖర్, డీఈఈ భూమన్న, ఏఈలు సత్యనారాయణ, శృతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపా కేసులను ఎత్తివేయాలి

నవతెలంగాణ-బోధన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

152 మందిపై ప్రభుత్వం నమోదు చేసిన ఉపా కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్య డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఇఫ్టు కార్యాలయంలో గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ కామ్రేడ్ సంధ్యతో పాటు 152మందిపై పెట్టిన ఉప 'కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ మధ్య కాలంలో ములుగు జిల్లా తాడ్వాయి పోలీసు స్టేషన్లో 'ఉపా' కింద కుట్ర కేసు పౌర ప్రజాస్వామిక, హక్కుల, మేధావులపై రాజద్రోహం, దేశద్రోహం కేసులుపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఉపా చట్టాన్ని రద్దు చేయాలని చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడ చెవిన పెడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే వారిపై ఉపా చట్టాన్ని ప్రయోగించే అణచివేసే చర్యలు కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కామ్రేడ్ సంధ్యపై అక్రమంగా ఉపా కేసు పెట్టడం సరైంది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిత్యం విమర్శించే కేసీఆర్ తన దాకా వచ్చే సరికి అదే నియంతృత్వ ధోరణిలో రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. పిఓడబ్ల్యు జాతీయ కన్వీనర్ కామ్రేడ్ సంధ్యతో పాటు 152మందిపై పెట్టిన ఉపా కేసును రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పౌర, ప్రజాస్వామిక, హక్కుల సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ నజీర్, లక్ష్మణ్‌గౌడ్, సురేష్, మల్లెపూల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఇచ్చిన పిలుపుమేరకు బోధన్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను ఇండ్లకు సాగనంపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం మెస్ చార్జీలు పెంచాలని, విద్యార్థులకు సకాలంలో యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలల రక్షణకు ప్రహరీ గోడల నిర్మాణం, నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు దోపిడిని అరికట్టాలన్నారు. ప్రకృతి వనం పేరుతో పాఠశాలకు చెందిన స్థలాలను ఆక్రమించడం అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మొగలాయీ, సంజీవ్, నరేష్, అనిల్ పాల్గొన్నారు.

భిక్కనూర్ : ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పాఠశాల బంద్ సోమవారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి నగర ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ గంధం సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడం, ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సమీర్ ఖాన్, నగర కార్యదర్శి రాజేందర్, యోగేష్, శివకృష్ణ, ఆదర్శ్, శ్రీనివాస్, సంజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ సోమవారం విజయవంతం అయింది. మండలంలోని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఏబీవీపీ పిలుపునివ్వడంతో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు తులసి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని, మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సరైన సమయంలో బుక్స్ యూనిఫామ్ అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని అదేవిధంగా కార్పొరేట్ విద్య సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సృజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వెన్నుముక.. కార్యకర్తలే

- చందూర్ జడ్పీటీసీ అంబర్ సింగ్

నవతెలంగాణ-వర్ని


ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటీసీ

కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక.. కార్యకర్తలేనని చందూర్ జడ్పీటీసీ అంబర్ సింగ్ అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించిన ఎన్రోలర్స్ సేవలను గుర్తించి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఎన్రోలర్‌ను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని హన్మాజీపేట్, కస్లపూర్, సంగోజీపేట్, కోనాపూర్, జక్కల్ దాని తండా, ఇబ్రహీంపేట్, తాడ్కోల్‌కు చెందిన 14 మంది ఎన్రోలర్స్‌కు రూ.5000ల చొప్పున 70,000లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి, యువతను మరింత బలోపేతం చేయడానికి ఆర్థికంగా సహాయం అందజేసినట్టు తెలిపారు.

ఈసారి బాన్సువాడ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగిరెసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దశగౌడ్, చందూర్ మండలాధ్యక్షులు పోతరాజు శ్రీనివాస్, చంద్రశేఖర్‌గౌడ్, అశోక్, నర్సింహారెడ్డి, రాములు, సోమప్ప, చందర్, బండి సాయిలు, సీహెచ్ సాయిలు, రూప్‌సింగ్, దయాకర్, బ్యాగరి దత్తు గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 13 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు కేటాయించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 13 ఎమ్మెల్యే, రెండు పార్లమెంట్ సీట్లు కేటాయించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అయిల్‌వార్ మారుతి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగల జనాబా ప్రకారం మెమెంతో మాకంతా ప్రకారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసేందుకు సీట్లు కేటాయించాలని అన్నారు. చలో హైద్రాబాద్‌కు ప్రతి ఒక్క గ్రామం నుంచి మాదిగ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నర్క్యారి రాజు మాదిగ, దండోర వీరయ్య, సారిక్‌వార్ శ్రీనివాస్, గడ్డపువార్ సంజు, గడ్డపువార్ మారుతీ, వాగ్మారే పండరి, విఠల్, బాలాజీ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

నవతెలంగాణ-బిచ్కుంద


ఇసుక ట్రాక్టర్ల యజమానుల వాగ్వాదం

బిచ్కుంద మండలంలోని ఖత్గాం, షెట్లూర్, హజ్గుల్, పుల్కల్ గ్రామాల మంజీర పరివాహక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా ఆదివారం అధికారులు సెలవుపై ఉంటారని గమనించిన అక్రమ ఇసుక రవాణా చోదకులు ఇదే అదునుగా భావించి ఇసుక రవాణా చేస్తుండగా రెవెన్యూ అధికారులు ఆదివారం రాత్రి పుల్కల్ గ్రామానికి చెందిన ఐదు ట్రాక్టర్లు, సోమవారం ఉదయం హజ్గుల్ గ్రామానికి చెందిన ఐదు ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హజ్గుల్ గ్రామానికి చెందిన కొందరు పట్టుకున్న ట్రాక్టర్లను తీసుకొని పారిపోవడానికి ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ భరత్‌కు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగగా పోలీసులకు సమాచారం అందించి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న పది ఇసుక ట్రాక్టర్లపై తదుపరి చర్యల నిమిత్తం బాన్సువాడ ఆర్డీవోకు సమాచారం అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. రాత్రి సమయంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రత్యేక టీంలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాయని గతంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న ఖత్గాం గ్రామానికి చెందిన 4 ట్రాక్టర్లకు మొదటి తప్పుగా 107 కింద బైండొవర్ చేసి 5000 చొప్పున జరిమానా విధించామని, రెండవసారి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లు సీజ్ చేయనున్నట్టు తహసీల్దార్ భరత్ హెచ్చరించారు.

రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి


కాంపిటీషన్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ అవగాహన కార్యక్రమాన్ని కాంగ్రెస్ రైతు సంఘ మండల అధ్యక్షులు లింగం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై యువతకు అర్థమయ్యేలా వివరించారు. రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం యువత అంతా ఈ పరీక్షకు రిఫరల్ కోడ్ 1076 ద్వారా రిజిస్టర్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్‌ను పొందడానికి 7661899899 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం మండలాధ్యక్షులు లింగం, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నవీన్, రాజుగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి, మోహన్‌రెడ్డి, నేహాల్, రూపేష్, విజయ్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జులైలో చలో హైదరాబాద్

నవతెలంగాణ-రెంజల్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ సంస్థ గత నిర్మాణంలో భాగంగా తలపెట్టిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు జులై నెలలో హైదరాబాదులోనే నిర్వహిస్తున్న మహాసభకు ఎమ్మార్పీఎస్ అత్యధిక సంఖ్యలో పాల్గొనడానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లక్ష్మీ గారి భూమయ్య కోరారు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాకిన్గారి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా హరి ప్రసాద్, కార్యదర్శిగా దుమ్ము రాము, కోశాధికారిగా వన్నెల కృష్ణ, ప్రచార కార్యదర్శిగా సాకిన్ గారి విజయ్, కార్యవర్గ సభ్యులుగా సందీప్, బన్నీ, నితిన్, సాయిలు తదితరులున్నారు.